

# బెటర్ ఛాయిస్

- వాలి హిరణ్మయిదేవి

''ఇక్కడ స్టాకేం బాగున్నట్లు లేదు. పైగా బోలెడు ధరలు చెబుతున్నారు. అలా ఇంకో షాపుకెళ్ళి చూద్దాం. పదండి'' అంది జయంతి.

మనస్సులోనే ఉస్సూరన్నాడు శేఖర్. కాబోయే భార్యతో షాపింగ్ అనేసరికి ఎన్నో మధురోహలతో బయల్దేరాడు. దాదాపు నాలుగు గంటలుగా మొత్తం బట్టల షాపులన్నీ తిప్పిస్తోంది గాని ఒక్క చీర తీసుకోలేదు. కార్టూనిస్టులు ఆడాళ్ళ చీరెల ఎంపిక మీద రకరకాల కార్టూన్లు వేస్తే 'అబ్బా ఎంత అతిశయోక్తిగా' వేస్తారను కొనేవాడు గానీ ఇప్పుడది తక్కువే అన్పిస్తోంద తడికి.

''అక్కడ 'చందనా'లో బ్లూ సారీ వచ్చిందన్నావ్‌గా'' అనడిగాడక్కడికీ వుండబట్టలేక.

''వచ్చింది గానీ ఎనిమిదొందల యాభై అన్నారు కదా. మీ అమ్మగారేమో ఏడు వందల్లో తీసుకోమన్నారు'' అంది జయంతి తన తప్పేం లేదన్నట్లు.

ఇక మాట్లాడలేక మౌనంగా జయంతిని అనుసరించాడు శేఖర్. తను సుమారు ముప్పై పెళ్ళి చూపులకెళ్ళి ఈ జయంతిని సెలెక్ట్ చేసుకొన్నాడు. ఈవిడ మూడొందల షాపులు తిరిగినా కావల్సిన చీర సెలెక్ట్ చేసుకోలేక పోతోంది. ఖర్మ' అని గొణుక్కున్నాడు.

''అవునూ, మీరు కాలేజీలో కట్నం తీసుకోనంటూ ఉపన్యసించారట'' అంది యధాలాపంగా జయంతి. గతుక్కుమన్నాడు శేఖర్.

''అదో వేడి. అయినా నేనెప్పుడూ అమ్మ మాట జవదాటలేదు. అమ్మ ఇష్ట ప్రకారం కట్నం తీసుకోక తప్పటం లేదు'' అన్నాడు శేఖర్ బుద్ధిమంతుడిలా.

''మరి మీ అమ్మగారికి ఉద్యోగస్థురాలిని కోడలిగా తెచ్చుకోవడం ఇష్టం లేదని విన్నాను. మీరేమో నాకు జాబ్ రాగానే వచ్చి పెళ్ళికి ఒప్పుకొన్నానని చెప్పారేంటి?'' అంది ఏమీ ఎరుగని దాన్లా.

'చచ్చాం' అనుకున్నాడు శేఖర్.

పైకి మాత్రం నవ్వుతూ ''అమ్మ పాతకాలం నాటిది. ఆవిడికిప్పుడున్న సాధక బాధకాలెలా తెలుస్తాయి. సిటీలో భార్యా భర్తలిద్దరూ సంపాదిస్తేనే నాల్గు హంగులూ అమర్చుకోగలిగేది'' అన్నాడు.

''మరి మా వాళ్ళని ఫ్రిజ్, బీరువా, టి.వి. ఇంకా ఏవేవో అడిగారెందుకు? మనిద్దరి జీతంతో కొనుక్కోవచ్చుగా'' అంది షాపులోని చీరల్ని శ్రద్ధగా చూస్తూ.

దానికేం బదులు చెప్పలేకపోయాడు శేఖరం.

''ఇక్కడి చీరెలంతగా బావుండ్లేదు. పైడబ్బు ఎంత పడితే అంత నేను వేసుకొంటా గానీ ఆ బ్లూసారీనే కొందాం పదండి'- అంది వెనుదిరుగుతూ.

ఒళ్ళు మండింది శేఖరానికి.

''మరి ముందే అలా చేస్తే సరిపోయేదిగా' అన్నాడు కాస్తంత చిరాగ్గా.

''మీరూ నన్ను నాలుగేళ్ళ క్రితం చూసినప్పుడే ఒప్పుకొంటే సరిపోయేదిగా. నాకు జాబ్ వచ్చే దాకా ఎందుకాగారు? ఈ మధ్యలో బెటర్ ఛాయస్ కోసం బోలెడన్ని సంబంధాలెందుకు చూశారు?'' అంది కోపంగా.

ఆలోచనలో పడ్డాడు శేఖరం.

ఇంటికి వెళ్ళగానే 'కట్న కానుకలు' వద్దని చెబితేనే తను సుఖపడగలడు అనుకొంటూ ఆమెని అనుసరించాడు.




## అందం

భార్యాభర్తలు సినిమాకి వెళ్ళారు. ఇంతలో భార్య అడిగింది!

''ఏమండీ... ఆ సినిమాలో హీరోయిన్ బావుందా... నేను బావున్నానా'' అని!

''నువ్వే'' చెప్పాడు భర్త.

''అయితే మీరు పిరికివారే కాదు... భయస్తులు కూడానన్న మాట''

—సి. శ్రీనివాసమూర్తి,హిందూపురం

## ఘడియ

''అమ్మాయి పెళ్ళి విషయము ఎత్తకుండా, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటారేంటండీ'' భార్య.

''మన చేతిలో ఏముందీ, కల్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగదంటారు. ఆ ఘడియ రావాలి కదా'' భర్త.

''అదే నా బెంగండి. దానికి కక్కు ఘడియ ముందు వచ్చినట్టు అనుమానంగా వుంది'' భార్య.

—వి.వి. శీతారామదాసు, గుంటూరు



పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్